సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అభివృద్ధి పనులపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులో చేపడుతున్న అభివృద్ధి పనులు, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలెక్టర్ హరేందిర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్నందున మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నగరంలో ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లామని శ్రీధర్ తెలిపారు. అలాగే 52వ వార్డులో ప్రధాన సమస్య అయిన ఎయిర్‌పోర్ట్ అథారిటీకి చెందిన 30 అడుగుల రోడ్డును 60 అడుగులకు విస్తరించే అంశాన్ని ఆయనకు వివరించారు. అలాగే 98 వార్డుల్లో పార్కులు, గ్రీన్ బెల్ట్‌ల అభివృద్ధికి నిధుల మంజూరు విషయమై ఆయనకు వినతి పత్రం అందించినట్టు శ్రీధర్ తెలిపారు.

రైతుబజారులో పూడికల తొలగింపు



పూడికలు తొలగిస్తున్న జీవీఎంసీ శానిటరీ సిబ్బంది

గోపాలపట్నం: ఇక్కడి రైతు బజారులో పూడికలను జీవీఎంసీ శానిటరీ విభాగం అధికారులు తొలగించారు. బయట పార్కింగ్ ప్రాంతంలో పూడికలతో దుర్వాసన వస్తోంది. ఇది గమనించిన అధికారులు వాటిని యంత్రాల సాయంతో తొలగించారు. అలాగే శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో కూడా వ్యర్థాలను తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేంకటాద్రి హుండీ లెక్కింపు

- 110 రోజులకు రూ.9,64,030 ఆదాయం



హుండీ లెక్కిస్తున్న అధికారులు, వేంకటాద్రి సేవకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రి క్షేత్రంలో వెలసిన వేంకటేశ్వరస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 110 రోజులకు గాను రూ.9 లక్షల 64 వేల 30 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి పీఎల్ఎన్ రాజు తెలిపారు. ముందుగా వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. లెక్కింపులో ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, వేంకటాద్రి సేవకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలో వీధి కుక్కల స్వైర విహారం



శునకాల స్వైరవిహారం

- వీధుల్లో గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి
- బయటికి రాలేకపోతున్నామని 40, 62, 63 వార్డుల స్థానికుల ఆవేదన
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



63వ వార్డులో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు



వీధి కుక్కల దాడిలో గాయపడిన మహిళ



కుక్కల దాడిలో గాయపడిన ఆటోడ్రైవర్ రమణ

సింధియా: జీవీఎంసీ 40, 62, 63 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల స్వైర విహారం అధికమైంది. విచ్చల విడిగా సంచరిస్తూ ప్రజలపై మూకుమ్మడిగా దాడికి పాల్పడుతూ తీవ్రంగా గాయపరుస్తున్నాయి. దీంతో రోడ్లపైకి రావాలంటేనే ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ముఖ్యంగా 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీ, షిప్‌యార్డ్ కాలనీ, సింధియా న్యూకాలనీ, 62వ వార్డు పరిధి దుర్గానగర్, ప్రకాష్‌నగర్, త్రినాథపురం, ఎస్సార్ కాలనీ, గుడివాడ అప్పన్న కాలనీ, 63వ వార్డు పరిధి చింతల్లోవ, క్రాంతినగర్, జయేంద్రకాలనీ, త్రినాథపురం తదితర ప్రాంతాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతుండడంతో ప్రజలు ఇళ్ల నుండి బయటికి రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. 40, 62, 63 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు అక్టోబర్‌లో 11 మంది, నవంబర్‌లో 19 మంది, డిసెంబర్‌లో 23 మంది కుక్క కాటుకు గురై క్రాంతినగర్ యూపీహెచ్‌సీ, 40వ వార్డు ఏకేసీ కాలనీలోని యూపీహెచ్‌పీ, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఒక్క ప్రభుత్వాస్పత్రుల్లోనే కుక్కకాటుకు గురైన వారి సంఖ్య ఈ స్థాయిలో ఉంటే, ఇక ప్రైవేటు అస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని వీధికుక్కలు వెంబడించడంతో వారు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం ఉండడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల ఉత్పత్తిని నివారించేందుకు చర్యలు చేపట్టాలని, కుక్కల దాడుల నుండి ప్రజలను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నియంత్రణ లేకే అనర్థాలు..

పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో వీధి కుక్కల నియంత్రణపై అధికారులు దృష్టి సారించకపోవడం వల్లే అనర్థాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వీధి కుక్కలను గుర్తించి వాటిని డాగ్ క్యాచర్స్ ద్వారా ఆధీనంలోకి తీసుకోవడం, మగ కుక్కలకు వేసెక్టమీ ఆపరేషన్లు చేయించడం, వ్యాక్సిన్లు వేయించడం వంటివి చేయాలి. కానీ అది ఖర్చుతో కూడుకున్న పని కావడం, పైగా కుక్కలను తీసుకొచ్చి ఆపరేషన్‌కు ముందు, తర్వాత వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉండడంతో వీధి కుక్కలను నిర్మూలించడం సాధ్యం కాదనే సాకుతో చేతులెత్తేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పశుసంవర్ధక శాఖదీ అదే తీరు అన్నట్లు ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ర్యాబిస్ వ్యాక్సిన్లు..

వీధి కుక్కల దాడిలో గాయపడిన వారికి వెంటనే ర్యాబిస్ వ్యాక్సిన్ వేయడం వల్ల ప్రమాదాన్ని అరికట్టవచ్చు. దీంతో ప్రభుత్వమే ఆస్పత్రులకు ఈ వ్యాక్సిన్ సరఫరా చేస్తుంది. ముఖ్యంగా జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలోని యూపీహెచ్‌సీలో సుమారు 50 ర్యాబిస్ వ్యాక్సిన్లు, 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో 60, గుల్లలపాలెం ప్రభుత్వాస్పత్రిలో 150 వరకు ర్యాబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి.



గాయపడిన వ్యక్తికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

బయటికి వెళ్లాలంటే భయమేస్తోంది..



మా ప్రాంతంలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు బయటికి వెళ్లినా గుంపులుగా దాడి చేస్తున్నాయి. ఇటీవల మా వీధిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆమెను వెంబడించి మరీ ఆమె కాలిని గాయపరిచాయి. అప్పటి నుండి బయటికి వెళ్లాలంటేనే భయమేస్తోంది.

–లక్ష్మి, 40వ వార్డు

నియంత్రణకు చర్యలు శూన్యం..



వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. దీంతో వాటి సంతతి అధికమై విచ్చలవిడిగా సంచరిస్తు కనిపించిన వారిపై దాడికి తెగబడుతున్నాయి. పిల్లలతో బయటికి వెళ్లాలంటేనే భయమేస్తోంది. వెంటనే వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి.

– చిన్నారి, 62వ వార్డు

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు..



ఇటీవల వీధి కుక్కల దాడులు ఎక్కువవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఎక్కడి నుంచో కుక్కలను తీసుకొచ్చి మరీ మా ప్రాంతాల్లో వదిలేస్తున్నారు. దీంతో చిన్నపిల్లలు, వాహన చోదకులను వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

– పెంటారావు, 63వ వార్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: స్థానిక శ్రీరామ్‌నగర్ ఫీడర్ ప్రాంతంలో నిర్వహణ పనుల్లో భాగంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, బాపూజీనగర్, గోపాలపట్నం బంక్, వుడా లేఅవుట్ కాలనీ, టైలర్స్ కాలనీ, గోపాలపట్నం సీఎంఆర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఇవేం పనులు సారూ..



నేలకూల్చేసిన చెట్టు

విశాఖ విద్య: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలనేది జీవీఎంసీ నినాదం. కానీ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేస్తున్న కొంత మంది కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా ఏపుగా పెరిగిన చెట్లను నేలకూల్చేస్తున్నారు. జీవీఎంసీ 90వ వార్డు సెయింట్ ఆన్స్ పాఠశాల సమీపంలో ఇదే జరుగుతోంది. డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును అడ్డంగా తవ్విన కాంట్రాక్టర్, అడ్డంగా ఉందని రోడ్డు మధ్యలోని డివైడర్లలో ఉన్న చెట్టును సైతం నేలకూల్చేశారు. పర్యావరణాన్ని హరించే ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

సాయినాథుడికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలోని షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం 19వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఉత్సవాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథుడికి అర్చకుడు గోపి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు సాయినామ జపం చేశారు.

63వ వార్డులో వాక్‌వే నిర్మాణానికి శంకుస్థాపన



వాక్‌వే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లోని శ్రీసాయిలత స్కూల్ సమీపంలో సుమారు రూ. 18 లక్షల జీవీఎంసీ నిధులతో వాక్‌వే నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి పనులు ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, త్వరలోనే పనులు ప్రారంభించి, ప్రజలకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్, స్థానిక నాయకులు జెర్రిపోతుల నర్సింగరావు, గూడెల కృష్ణ, రమణ, శ్యామ్, చంద్రశేఖర్, విష్ణు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగహన కల్పిస్తున్న ద్వారకా జోన్ పోలీసులు

సీతమ్మధార : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రతాప్ సూచించారు. గురుద్వార జంక్షన్‌లో హెల్మెట్ లేకుండా రాకపోకలు సాగిస్తున్న వారికి మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్ ప్రయాణం చేయరాదని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. కారు డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ముందు సీటులో కూర్చునేవారు విధిగా సీటు బెల్టు పెట్టుకోవాలని తెలిపారు. వాహనాలు నడిపే సమయంలో ఫోన్లలో మాట్లాడరాదని స్పష్టం చేశారు. రోడ్డు దాటే పాదచారులు ఫోన్లలో మాట్లాడడం చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. రెడ్‌సిగ్నల్ జంపింగ్ చేసి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు చాలా మంది ఆర్టీసీ సిటీ బస్‌ల ఫుట్‌పాత్‌ల మీద వేలాడుతూ ప్రమాదభరితంగా ప్రయాణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు లోపల ఖాళీగా ఉన్నా సరే ఫుట్‌పాత్‌ల మీద వేలాడుతూ వెళ్తున్నారని... ఇలాంటి ప్రయాణం చాలా ప్రమాదకరమన్నారు. మత్తు పదార్థాలు, గంజాయికి బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని, చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు.

సేంద్రియ ఎరువులతో చక్కటి దిగుబడి



సేంద్రియ ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

పెందుర్తి: పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం వలన అధిక దిగుబడి రావడంతో పాటు రైతులకు సాగు వ్యయం కూడా తగ్గుతుందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త (మృత్తికశాస్త్రం) డాక్టర్ టి.శ్రీలత అన్నారు. పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని జెర్రిపోతులపాలెం, నరవ, పినగాడి ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ జీవ ఎరువుల వాడకం వలన పంట బలంగా పెరిగి, నాణ్యత ఉంటుందన్నారు. సాధ్యమైనంత వరకు రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుంటే ఇటు పంటకు.. అటు రైతుకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. పలు అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సరిత, సేద్యశాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వి.గౌరీ బృందం రైతులకు మేలైన సేద్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్, ఏఈవో రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆహ్వాన్ ఫెస్ట్

దాబాగార్డెన్స్: నిత్యం పాఠ్యాంశాల బోధన, పోటీ పరీక్షలకు కసరత్తు చేసే విద్యాసంస్థలో కళలు, క్రీడలతో సందడి వాతావరణం నెలకొంది. బిగ్‌బాస్ ఫేమ్, యాక్టర్ అర్జున్ కల్యాణ్ సందడితో ఏవీఎన్ కళాశాల ప్రాంగణం దద్దరిల్లింది. ఇక్కడ మంగళవారం నిర్వహించిన 'ఆహ్వాన్ ఫెస్ట్'లో పాల్గొన్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు మీ కోసం మీ పోలీస్ కార్యక్రమం ద్వారా ఎన్నో మంచి విషయాలను విద్యార్థులకు బోధించారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి ఏవీఎన్ కళాశాల ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం కాకుండా, ఇంతర ప్రాంతాలకు చెందిన వారికి విద్య అందిస్తుందని, కళాశాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొని ప్రతిభ చూపాలని అభిలషించారు. కార్యక్రమంలో ఏయూ ప్రొఫెసర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డీన్ శంకర్ నారాయణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ మురళి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నివారణ



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు రాధిక

గోపాలపట్నం: క్యాన్సర్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్‌సీజీ క్యాన్స్ ఆస్పత్రి వైద్యులు శరత్‌చంద్ అన్నారు. మంగళవారం రాధిక మల్టీస్పెషల్ ఆస్పత్రిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తిస్తే వైద్యం సులువుగా జరుగుతుందని అన్నారు. ఆ సమయంలో ఆయా లక్షణాలను గుర్తించాలని, అందుకు ప్రాథమికంగా ఆర్ఎంపీ వైద్యులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాధికా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యురాలు రాధిక మాట్లాడుతూ క్యాన్సర్‌పై అపోహలు వద్దని తెలిపారు. సరైన సమయంలో వైద్యం అందిస్తే నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, ఆర్ఎంపీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష అభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అప్పన్న అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎన్‌జీజీవోస్ కాలనీ దరి శాంతిపురానికి చెందిన కలిదిండి హేమసాయి రమణ లక్ష్మి అనే దాత రూ.లక్ష 1,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరపున అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ దాతకు బాండ్ ఇచ్చారు. అనంతరం స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు.

ట్రాఫిక్ నిబంధనలతోనే సురక్షిత ప్రయాణం



ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

గోపాలపట్నం: లారీ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అడిషనల్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ కె. ప్రవీణ్‌కుమార్ అన్నారు. విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా లారీ డ్రైవర్లు, ఓనర్లకు ఉచిత వైద్య శిబిరం, కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. లారీ డ్రైవర్లు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. 6 నెలలకు ఒకసారి కంటి పరీక్షలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. నగరంలో నిర్దిష్ట సమయాల్లో మాత్రమే భారీ వాహనాలు నడపాలని తెలిపారు. మద్యం సేవించి లారీలు నడపరాదని తెలిపారు. సీనియర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం. బుచ్చిరాజు మాటాడుతూ నగర పరిధిలో ఎల్ఈడీ లైట్లు వాడరాదని దీని వల్ల ఎదురుగా వస్తున్న వాహన దారులకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ మన్మోహన్, ఏఎంవీఐ శ్రీనివాస యాదవ్, హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ జి. అప్పారావు, ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి. అప్పలరాజు, విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కె. అర్జునరావు, కోశాధికారి కె. కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమమే లక్ష్యం



మాట్లాడుతున్న డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత పరిధిలోని అర్హులైన నిరుపేదలకు తమ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అవసరమైన సాయం అందిస్తామని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 2023–24లో సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పారిశ్రామిక ప్రాంత పరిధిలో పలు సామాజిక భవనాలు, స్కూళ్లు, పార్కుల అభివృద్ధి, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, వైద్య శిబిరాల నిర్వహణ, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు స్వయం ఉపాధిలో శిక్షణ, అనంతరం వారికి ఉపాధి చూపటం, బాలింతలకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ, నిరుద్యోగ యువతకు పలు అంశాల్లో ఉచిత శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గడచిన ఏడాది సుమారు రూ. మూడు కోట్ల మేర సీఎస్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేశామన్నారు. అలాగే రూ. 10కే నిరుపేదలకు వైద్య సేవలు, రాయితీపై మందుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ పాత్రుడు, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీకాంత్, డిప్యూటీ మేనేజర్ (సీఎస్ఆర్) వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం కుయుక్తులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణకు కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాల ధాటిని తట్టుకోలేక మోదీ ప్రభుత్వం దొడ్డి దారిన ప్రైవేటీకరణ అజెండాను అమలు చేసే ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ నాయకుడు సంతోష్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షలో సీఐటీయూ జగదాంబ జోన్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడారు. నాలుగు సంవత్సరాలుగా మొదట ప్లాంట్ నష్టాల్లో ఉందని, ఆ తర్వాత ప్లాంట్ అమ్మకానికి నష్టాలతో నిమిత్తం లేదని నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వం ప్రకటించడం దారుణమన్నారు. ప్లాంట్ మనుగడకి కావలసిన ముడి సరుకు ఆపేయడం, కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం, వీఆర్ఎస్ ప్రకటించడం వంటి కుయుక్తులతో కార్మికులను భయాందోళనలకు గురి చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. సీఐటీయూ సీనియర్ నాయకులు రాజు, ప్రొఫెసర్ పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com